RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక
వరంగల్ | గురువారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 274 | అక్టోబర్ 02, 2025 | వెల : రూ.3-00



రాంలీల ను విజయవంతం చేయండి

2లో..

# అగ్రరాజ్యాల సరసన భారత్!



- దేశీయంగా ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానాల తయారీ
- డీఆర్‌డీవోతో కలిసి 7 దేశీయ కంపెనీలు బిడ్ దాఖలు
- రూ. 2 లక్షల కోట్ల వ్యయంతో 125 ఐదోతరం స్టెల్త్ జెట్ ఫైటర్లు

**వేద న్యూస్, డెస్క్:**

స్వదేశీ ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానాల తయారీ కార్యరూపం దాల్చే దిశగా మరో అడుగుపడింది. ప్రొటోటైప్ ఏఎంసీఏ ప్రాజెక్టులో భాగంగా డీఆర్‌డీఓతో కలిసి పనిచేసేందుకు ఏడు దేశీయ కంపెనీలు బిడ్డింగ్ దాఖలుచేశాయి. రూ. 2 లక్షల కోట్ల వ్యయంతో 125 ఐదోతరం స్టెల్త్ జెట్ ఫైటర్లను తయారు చేయనున్నారు. దీంతో భారత్ అగ్రదేశాలైన అమెరికా, రష్యా, చైనాల సరసన చేరనుంది.

**- ఏఎంసీఏ ప్రాజెక్టులో ముందడుగు**

డీఆర్డీవో సారథ్యంలో ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానాల అభివృద్ధి కోసం ప్రారంభమైన ఏఎమ్‌సీఏ ప్రాజెక్టులో ముందడుగు పడింది. ఏఎమ్‌సీఏ ప్రొటోటైప్ నమూనాల రూపకల్పన, అభివృద్ధి కోసం 7 భారతీయ కంపెనీలు డీఆర్‌డీవోతో కలిసి పనిచేసేందుకు బిడ్డింగ్ దాఖలు చేశాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా 125 ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానాలను డీఆర్‌డీవో భాగస్వామ్యంలో తయారు చేయనున్నారు. ఎల్ అండ్ టీ, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, అదానీ డిఫెన్స్ తదితర సంస్థలు బిడ్డింగ్ దాఖలు వేశాయి.ఆ బిడ్లను మాజీ బ్రహ్మోస్ ఏరోస్పేస్ చీఫ్ ఎ.శివథాను పిళ్లై నేతృత్వంలోని కమిటీ పరిశీలించి రక్షణ శాఖకు నివేది ంచనుంది. షార్ట్ లిస్ట్ చేసిన రెండు కంపెనీలను రక్షణశాఖ తుది ఎంపిక చేయనుంది. ఇద్దరు బిడ్డర్లకు రూ.15వేల కోట్ల విలువైన పనులు అప్పగిస్తారు. రూ. 2లక్షల కోట్ల ఏఎమ్‌సీఏ ప్రాజెక్టులో భాగంగా 125 ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానాలు తయారు చేయనున్నారు. 2035 నాటికి అవి వాయుసేనలో చేరే అవకాశం ఉంది.



**- అమెరికా కంటే పవర్ ఫుల్ ఇంజిన్!**

ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానాలను తయారు చేస్తే భారత్ అగ్ర దేశాలైన అమెరికా, చైనా, రష్యా సరసన చేరుతుంది. ఇప్పటివరకు అమెరికా ఎఫ్ - 22, ఎఫ్ - 35, చైనా జే- 20, రష్యా ఎస్ యూ- 57 ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానాలు కలిగి ఉన్నాయి. భారత్ తయారు చేసే తొలి ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానాలు సింగిల్ సీట్, రెండు ఇంజన్లు కలిగి ఉండనున్నాయి. ఇవి అమెరికా, రష్యాకు చెందిన ఎఫ్ - 22, ఎఫ్ - 35, ఎస్ యూ- 57 మాదిరిగా అడ్వాన్స్‌డ్ స్టెల్త్ కోటింగ్‌తో పాటు అంతర్గత ఆయుధాలు కలిగి ఉండనున్నాయి. వాటి ఆపరేషనల్ సామర్థ్యం 55వేల అడుగులు కాగా అంతర్గతంగా 1,500కిలోలు, బాహ్యంగా 5,500కిలోలు ఆయుధాలను మోసుకెళ్లగలవని అంచనా. ఏఎంసీఏ మరో 6,500కిలోల ఇంధనాన్ని మోసుకెళ్లే సామర్థ్యం కలిగి ఉంటుంది. ఇందులో రెండు వెర్షన్ల ఇంజిన్లు ఉంటాయని తెలుస్తోంది. రెండో ఇంజిన్‌ను భారత్ దేశీయంగా అభివృద్ధి చేయనుంది. అది అమెరికా తయారీ జీఈ 414 మొదటి ఇంజిన్ కంటే శక్తిమంతంగా ఉంటుందని అంచనా. మొత్తంగా ఇది సూపర్ మ్యానోవ్రబుల్, స్టెల్తీ మల్టీరోల్ ఫైటర్ జెట్ కానుంది.


# కనబడుట లేదు



తంగెళ్ళ కళ్యాణి గారు
వయసు 43 సం॥ లు చామన చాయ
డ్రెస్ తెల్లచూడిదార్, పింకుచూన్ని
23-9-2025 నుండి కనబడుట లేదు
ఆచూకి తెలిపిన వారికి తగిన
బహుమానం ఇవ్వబడును
అచూకి తెలుపవలసిన ఫోన్ నెం.
సెల్ : 9908843080
8712685090, 08712685117


# అమల్లో ఎలక్షన్ కోడ్

**వేద న్యూస్, చొప్పదండి**



చొప్పదండి పట్టణం మరియు మండల ప్రజలు దుర్గామాత నిమ్మజ్జన ర్యాలీలను మరియు నిమ్మజ్జనాలను ఉదయం: 06 గంటల నుండి రాత్రి :10 గంటల్లోపు మాత్రమే జరుపుకోవాలని చొప్పదండి ఎస్ ఐ నరేష్ రెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన సందర్భంగా రాత్రి 10 గంటల తర్వాత 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎటువంటి ఊరేగింపులకి అనుమతులు లేవని తెలిపారు.


# మళ్లీ సమ్మె దిశగా ప్రైవేట్ కళాశాలలు

**- ఈనెల 12 వరకు ప్రభుత్వానికి డెడ్‌లైన్**



డెస్క్ : ప్రభుత్వం ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలల మళ్లీ సమ్మె బాట పట్టనున్నాయి. ఇవాళ అత్యవసర సమావేశం నిర్వహించిన ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వ వైఖరిపై మీడియా సమావేశం ఏర్పాటు చేశాయి. ఎఫ్ఏటీహెచ్ఐ ఛైర్మన్ రమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి విద్యారంగం ఆఖరి ప్రాధాన్యతగా ఉందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వ విడుదల చేయలేదని, గత నెల 21, 22 తేదీల్లో రూ.600 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చినా బకాయిలు చెల్లించలేదని, రూ.200 కోట్లు నిధులు మాత్రమే విడుదల చేశారని తెలిపారు. దీపావళి పండగలోపు రూ.1,200 కోట్లు ఇస్తామన్నారని, ఎలా ఇస్తారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ఈ నెల 12లోపు బకాయిలు చెల్లించకుంటే 13 నుంచి సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశారు. ఇవాల్టి నుంచి సీఎంవో కార్యాలయంతో తప్ప మరెవరితో చర్చించమని, అవసరం అయితే విద్యార్థులతో కలిసి ఛలో హైదరాబాద్ చేపడతామని ఆయన హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విద్యారంగం ఆఖరి ప్రాధాన్యతగా ఉంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వ

మిగతా 4వ పేజీలో..



# ఐ బొమ్మపై పోలీసుల దృష్టి

- సంచలన ప్రకటన విడుదల చేసిన పైరసీ వెబ్‌సైట్
- సినిమా, ఓటీటీ పైరసీ కేసులో సైబర్‌క్రైమ్ పోలీసుల దర్యాప్తు

**వేద న్యూస్ డెస్క్:**

సినిమా, ఓటీటీ పైరసీ కేసులో హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇటీవల థియేటర్‌లో రికార్డ్ చేసే వారితో పాటు సర్వర్లు హ్యాక్ చేస్తున్న ప్రధాన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. దర్యాప్తు క్రమంలో ఐబొమ్మ వెబ్‌సైట్‌పై దృష్టి పెట్టడంతో దాని నిర్వాహకులు పోలీసులకు సవాల్ విసిరారు. దానిని ఛాలెంజింగ్‌గా తీసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు ఆ వెబ్‌సైట్ కోసం పని చేస్తున్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్‌లలో ఐబొమ్మకు

మిగతా 4వ పేజీలో..

ఆర్టీసీ ప్రయాణికులకు

# దసరా లక్కీడ్రా



2లో..

# బీసీ రిజర్వేషన్ల బిల్లుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

- కోర్టులను ఈటల తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శ - మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**వేద న్యూస్ డెస్క్:**



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసమే తమ పోరాటమని ఆమె స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఈరోజు ఆమె మీడియాతో మాట్లాడుతూ... బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందే వరకు కేవలం రెండు నెలలు ఆగి ఎన్నికలు నిర్వహిస్తే ప్రభుత్వానికి వచ్చే నష్టమేంటని ఆమె ప్రశ్నించారు. ఒకవైపు జీవో ఇచ్చి, మరోవైపు తమ అనుచరులతోనే కోర్టులో కేసు వేయించారని, ఈ విషయం సోషల్ మీడియాలో కూడా చర్చనీయాంశమైందని ఆమె వ్యాఖ్యానించారు. గ్రామాల్లో లేని సామాజికవర్గాలకు కూడా రిజర్వేషన్లు కేటాయించడం గందరగోళానికి దారితీస్తోందని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన కులగణన వివరాలను బయటపె

మిగతా 4వ పేజీలో..

# మహిళలపై నేరాల్లో తెలంగాణ టాప్

- 2023లో దేశవ్యాప్తంగా మహిళలపై 4.5 లక్షల నేరాలు - గత రెండేళ్లతో పోలిస్తే స్వల్పంగా పెరిగిన కేసులు




డెస్క్ : భారత్‌లో మహిళలపై నేరాలు తగ్గడం లేదు. 2023 సంవత్సరంలో దేశవ్యాప్తంగా దాదాపు 4.5 లక్షల కేసులు నమోదైనట్లు జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) తన తాజా నివేదికలో వెల్లడించింది. గత రెండేళ్లతో పోల్చితే ఈ సంఖ్య స్వల్పంగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్ల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఎన్‌సీఆర్‌బీ ఈ నివేదికను రూపొందించింది. నివేదిక ప్రకారం.. 2023లో మొత్తం 4,48,211 కేసులు నమోదు కాగా, 2022లో ఈ సంఖ్య 4,45,256గా, 2021లో 4,28,278గా ఉంది. దీన్నిబట్టి చూస్తే మహిళలపై నేరాలు క్రమంగా పెరుగుతున్నాయని స్పష్టమవుతోంది. దేశవ్యాప్తంగా ప్రతి లక్ష మంది మహిళలకు 66.2 నేరాలు జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ కేసుల్లో ఛార్జిషీట్ల దాఖలు రేటు 77.6 శాతంగా నమోదైంది. మహిళలపై నేరాల రేటులో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం గమనార్హం. తెలంగాణలో ప్రతి లక్ష మంది మహిళలకు 124.9 నేరాలు నమోదయ్యాయి. ఈ

మిగతా 2వ పేజీలో..

# ఆలయఫౌండేషన్ ఆధ్వర్యంలో వీల్ చైర్ అందజేత

**వేద న్యూస్, హుజురాబాద్ ప్రతినిధి:**



కరీంనగర్ జిల్లా వీణవంక మండలం వల్బపూర్ గ్రామానికి చెందిన నిరుపేద మహిళ మారముల్ల మంగమ్మ పక్షవాతంతో బాధపడుతున్నది ఆలయఫౌండేషన్ కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్ నేత ను వారు సంప్రదించగా, ఆలయఫౌండేషన్ మార్గదర్శకులు పరికిపండ్ల నరహరి ఐఏఎస్ అధికారి చొరవతో ఆమెకు వీల్ చైర్‌ను బుధవారం అందజేశారు. గడిచిన పది సంవత్సరాల నుండి ఆలయ ఫౌండేషన్ ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలలో సేవాకార్యక్రమాలు చేస్తున్నామని గుణసాగర్ వెల్లడించారు. విద్య, వైద్యం, ఉపాధి కార్యక్రమాలు చేస్తున్నామనీ చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, తలసేమియా వ్యాధి చిన్నారుల కోసం రక్తదాన శిబిరాలు, ఉచిత కంటి శిబిరాలు, హరితహరం, వికలాంగులకు జైపూర్ ఫుట్ ను అందిస్తున్నమని పేర్కొన్నారు . నరహరి మధ్యప్రదేశ్ రాష్ట్రం కేడర్ లో విధులు నిర్వహిస్తూ.. జన్మభూమి కి సేవ చేయడం చాలా హర్షణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయఫౌండేషన్ కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్ నేత, జీడి దేవెందర్, అందె కుమార్, మారముల్ల అంజి ప్రభు పాల్గొన్నారు.

# రాంలీల ను విజయవంతం చేయండి

**వేద న్యూస్, చొప్పదండి :**



విజయదశమిని పురస్కరించుకొని చొప్పదండి హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే రాంలీల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రా%లీల ఉత్సవ సమితి కన్వీనర్ కటకం మహేష్ పిలుపునిచ్చారు. చొప్పదండి పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో రాంలీల కార్యక్రమ ఏర్పాట్లను ఎస్సై నరేష్ రెడ్డి మరియు కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా నిర్వహించేందుకై భారీ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు, వక్తలు ప్రసంగాలతో ఈ కార్యక్రమానికి ప్రత్యేక శోభను తీసుకొచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. హిందూ బంధువులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయగలరని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు పడకంటి క్రిష్ణ, వ్యవస్థా ప్రముఖ్ చేపూరి సత్యనారాయణ, హిందూ ఉత్సవ సమితి కన్వీనర్ ఎన్నం మునిందర్, కో-కన్వీనర్లు మోలుమురి రమేష్, నాయకులు బత్తిని ప్రశాంత్, మంచికట్ల మల్లేశం, దూస రాము, దండే మహేష్, గుండేటి శివ శంకర్, చల్ల అనూష్, తాడూరి రామకృష్ణ, శివకృష్ణ, జిట్ట కుమార్, గుర్రం సమర్ రెడ్డి, పుదరి మధు, గంగు సంపత్, జాగిరి రాజేందర్, గుడెల్లి లక్ష్మీపతి, మేడి శ్రీనివాస్, గుర్రం ఆనంద రెడ్డి, దండే సత్యానందం, మోలుమురి అశోక్, అర్థవెల్లి శ్రీనివాస్, స్వర్గం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పంచ పరివర్తన ద్వారానే దేశ హితం

**- టీపీయూఎస్ హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. సంగెం శ్రీనివాస్**

**వేద న్యూస్, హుజూరాబాద్ ప్రతినిధి:**



సమాజంలో అన్ని వర్గాలవారూ కలసికట్టుగా ఉండాలనే లక్ష్యంతోనే పంచపరివర్తన్‌కి ఆర్ఎస్ఎస్ శ్రీకారం చుట్టిందని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. మునుకుంట్ల శ్రీనివాస్( సంగెం శ్రీనివాస్) అన్నారు. ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మర్రిపల్లిగూడెం గ్రామం లోనీ కాకతీయ విద్యాలయం లో బువారం నిర్వహించిన విజయదశమి ఉత్సవం లో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. సామాజిక సామరస్యత, పర్యావరణం, కుటుంబ ప్రబోధన్, స్వదేశీ, పౌర నియమాలు అనే ఐదు విషయాలను సమాజంలో ప్రతి పౌరుడు తెలుసుకొని వాటి ఆచరణకు నడుంబించాలన్నారు. వీటి ద్వారా సమాజంలో సమూలమైన మార్పు వస్తుందని చెప్పారు. అధర్మంపై ధర్మం సాధించిన విజయమే విజయదశమిగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాసూరి రామ్మూర్తి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాల తపస్సు కారణంగా నేడు దేశం ప్రగతి పథంవైపు నడుస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ మర్రిపల్లిగూడెం స్వయం సేవకులు హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శ

**వేద న్యూస్, చొప్పదండి:**



మండలంలోని పలు బాధిత కుటుంబాలను చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం కాంగ్రెస్ నాయకులతో కలిసి పరామర్శించారు. కాట్నపల్లి గ్రామానికి చెందిన ట్రైనీ ల్యాండ్ సర్వేయర్ లింగంపల్లి విశ్వతేజ ఇటీవల ప్రమాదవశాత్తు వాగులో పడి మరణించగా ఉన్న ఒక్క కొడుకు దూరమైన ఆ తల్లి తండ్రులను ఓదార్చి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఇటీవల మృతి చెందిన మాజీ వార్డు సభ్యులు గుండ లింగమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం సాంబయ్యపల్లె గ్రామానికి చెందిన మండల మనోహర్ అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. తదుపరి ఇటీవల మండల కేంద్రానికి చెందిన అంబేద్కర్ సంఘం నాయకులు కళ్లెపెల్లి అరవింద్ తండ్రి కళ్లెపెల్లి ఆనందం మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, బిసి కాలనీకి చెందిన కొంకటి సందీప్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి తల్లితండ్రులను ఓదార్చి కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

# ఎమ్మెల్సీకి జన్మదిన శుభాకాంక్షలు



**వేద న్యూస్, హైదరాబాద్:**

రాజ్యసభ సభ్యులు మంద కృష్ణ మాదిగ టీచర్స్ బిజెపి ఎమ్మెల్సీ మల్క కొమరయ్యని మహేంద్రహిల్స్ లో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పుష్పగుచ్చం ఇచ్చి శాలువాతో ఎమ్మెల్సీ మల్క కొమరయ్యని సన్మానించి ఆ దేవుడు సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ప్రజాసేవలో నిండు నూరేళ్లు కొనసాగాలని కోరుకుంటున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

# మహిళలపై నేరాల్లో తెలంగాణ టాప్

జాబితాలో రాజస్థాన్ (114.8), ఒడిశా (112.4), హర్యానా (110.3), కేరళ (86.1) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే, అత్యధిక సంఖ్యలో కేసులు నమోదైన రాష్ట్రంగా ఉత్తరప్రదేశ్ (66,381) మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత మహారాష్ట్ర (47,101), రాజస్థాన్ (45,450), పశ్చిమ బెంగాల్ (34,691), మధ్యప్రదేశ్ (32,342) రాష్ట్రాలు నిలిచాయి.

నమోదైన కేసుల్లో అత్యధికంగా భర్త లేదా వారి బంధువుల క్రూరత్వానికి (ఐపీసీ సెక్షన్ 498ఏ) సంబంధించినవే ఉన్నాయి. ఇలాంటి కేసులు 1,33,676 నమోదు కాగా, కిడ్నాప్, అపహరణ కేసులు 88,605 ఉన్నాయి. మహిళల గౌరవానికి భంగం కలిగించే ఉద్దేశంతో జరిగిన దాడులు 83,891 నమోదు కాగా, అత్యాచారం కేసులు 29,670గా ఉన్నాయి. వీటితో పాటు వరకట్న హత్యలు, ఆత్మహత్యకు ప్రేరేపించడం వంటి కేసులు కూడా గణనీయ సంఖ్యలో నమోదైనట్లు ఎన్‌సీఆర్‌బీ నివేదిక స్పష్టం చేసింది.



# రక్తదానం ఒకరికి ప్రాణదానం

**వేద న్యూస్, హైదరాబాద్:**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బర్త్ డే సందర్భంగా చేపట్టిన సేవా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ లోని బాపూజీ నగర్ లో బి ఎన్ మల్లిఖార్జున (కంటోన్మెంట్ బోర్డు సభ్యులు) ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య బుధవారం సందర్శించారు. రక్తదాన శిబిరాన్ని సందర్శించి వారికి ఫ్రూట్స్, జ్యూస్ అందజేశారు. వారి సేవలను గుర్తిస్తూ రక్త దాతలను శాలువాతో సన్మానించి ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మాట్లాడుతూ " సేవా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాలను నిర్వహించి తెలంగాణ వ్యాప్తంగా వందల యూనిట్ల రక్తాన్ని సేకరించి ఆపదల్లో ఉన్నవారికి ,తలసేమియా బాధితులకు అందజేయాలనే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆశయాన్ని నిజం చేసినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. రక్తదాన శిబిరాలతో పాటు స్వచ్ఛభారత్, దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ, మేరా దేశ్ పెహలే థియేటర్ ప్లే కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామని ఆయన తెలిపారు.

# ఆర్టీసీ ప్రయాణికులకు దసరా లక్కీడ్రా

**వేద న్యూస్ డెస్క్:**




ఆర్టీసీ (రోడ్డు రవాణా సంస్థ) ప్రయాణికులకు మరింత దగ్గరయ్యేందుకు సరికొత్త ఆలోచనలతో ముందుకు దూసుకెళ్తోంది. పండగ వేళల్లో ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి, ప్రయాణికు లను ప్రైవేటు ట్రావెల్స్‌కు వెళ్లకుండా ఉండేందుకు దసరా లక్కీ డ్రా పేరుతో బంపర్ ఆఫర్‌ను ప్రకటించింది. ఇంచుమించు ప్రైవేటు ట్రావెల్స్‌కు తగ్గకుండా పండగ సీజన్లో టికెట్లపై డిస్కౌంట్లు ఇస్తోంది. ఈ లక్కీ డ్రా సెప్టెంబరు 27న ప్రారంభమైంది. అక్టోబర్ 6వ తేదీ వరకు ఈ ఆఫర్ నడవనుంది. దీనికి గాను ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 11 డిపోలకు చెందిన బస్సుల్లో ప్రయాణించేవారు తాము తీసుకున్న టికెట్‌పై పేరు, ఫోను నంబరు, చిరునామా రాసి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన డబ్బాలో వేయాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని 11 డిపోలకు చెందిన బస్సుల్లో రోజుకు సాధారణ రోజుల్లో 4.5 లక్షల నుంచి 5 లక్షల వరకు ప్రయాణిస్తారు. పండగ వేళల్లో 6 లక్షల వరకు ప్రయాణికులు బస్సుల్లో గమ్యస్థానాలకు చేరుకుంటారు. వారిని ఆకర్షించేందుకు ఏర్పాటు చేసిన లక్కీ డ్రా స్కీంతో మరింతమంది పెరిగే అవకాశముంటుంది. లక్కీడ్రా లో మొదటి బహుమతి గెలుచుకున్నవారికి రూ.25 వేలు చెల్లించనుంది. రెండో బహుమతికి రూ.15 వేలు, మూడో బహుమతి కింద రూ.10 వేలు అందించనున్నారు. ఆర్టీసీకి చెందిన హైఎండ్ బస్సులు - సెమీ డీలక్స్, మెట్రో డీలక్స్, డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరి నాన్-ఏసీ, ఏసీ బస్సుల్లో ప్రయాణించిన వారు మాత్రమే ఈ లక్కీ డ్రాలో పాల్గొనేందుకు అర్హులు. ఆర్టీసీ బస్సు సర్వీసుల్లో ప్రయాణం పూర్తయిన తర్వాత వారి టికెట్‌పై తమ పూర్తి పేరు, ఫోన్ నంబరు స్పష్టంగా రాయాలి. ఆ తర్వాత టికెట్‌ను బస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక డ్రాప్ బాక్స్‌లలో వేయాలి. ఆర్టీసీ సంస్థ ప్రతి రీజియన్‌కు ముగ్గురు చొప్పున మొత్తం 11 రీజియన్‌ల నుంచి 33 మంది విజేతలను ఎంపిక చేస్తుంది. కరీంనగర్ రీజియన్ కార్యాలయంలో ఈ నెల 8న సాయంత్రం 4 గంటలకు తీసే డ్రాలో ముగ్గురు విజేతలను ప్రకటిస్తారు.


బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించడానికి టీజీఎస్ ఆర్టీసీ స్పెషల్ బస్ సర్వీసులు ఏర్పాటు చేసింది. ఈ మేరకు 7,754 స్పెషల్ బస్సులు నడుపుతోంది. గత దసరా కంటే ఈ సారి రద్దీకి తగ్గట్లుగా అదనంగా 617 బస్సు సర్వీసులను ఏర్పాటు చేసింది. ఈ నెల 20వ తేదీ నుంచి అక్టోబరు 2 వరకు ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అక్టోబరు 5,6 తేదీల్లో తిరుగు ప్రయాణం కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఈ బస్సుల్లో అదనంగా 50 శాతం వరకు అదనపు ఛార్జీలను వసూలు చేయనున్నట్లు ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే స్పష్టం చేసింది.

# ప్రకృతి ఒడిలో సేదతో ఆయుష్షు!

ప్రకృతి మనలోని ఒత్తిడి హార్మోన్లను తొలగించడం ద్వారా ఆరోగ్యకరమైన హార్మోన్ల సమతుల్యత ఏర్పడుతుంది. ప్రకృతితో ఈ పరస్పర చర్య రోజువారీ ఒత్తిళ్ల వల్ల కలిగే మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది, శారీరక మరియు భావోద్వేగ శక్తితో మనల్ని పునరుజ్జీవింపజేస్తుంది. ప్రకృతిలోని అడవులు, నదులు, సరస్సులు, చెట్లు, గడ్డి మైదానాలు, జంతువులు, మొక్కలు, సీతాకోకచిలుకలు, పక్షులు మిగతా జీవరాశులను చూసినట్లయితే మనకు మన శరీరానికి సంతోషకరమైన పరిస్థితులు ఏర్పడుతాయి. దానికి ముఖ్యమైన కారణం ఈ సందర్శన ద్వారా మన జ్ఞానేంద్రియాలు, శరీరము కొన్ని హార్మోన్లను విడుదలకు కారణం అవుతాయి. ప్రకృతి ఒత్తిడిని తగ్గించే ప్రభావాల వెనుక ఉన్న శాస్త్రం ప్రకృతి కార్టిసాల్ (ఒత్తిడి హార్మోన్) ను ఎలా తగ్గిస్తుందో. ఆనందానికి ఎండార్ఫిన్లు, డోపమైన్‌ను పెంచడంలో ప్రకృతి పాత్ర కీలకం. రక్తపోటు, హృదయ స్పందన రేటును తగ్గించడంపై ప్రభావాలు. ఈ ప్రయోజనాలను నిర్ధారించే పరిశోధన అధ్యయనాలను మీరు చెక్ చేసుకోవచ్చు(ఉదా., 20 - నిమిషాల ప్రకృతి విరామాలపై హార్వర్డ్ అధ్యయనం).

వాటిలో కొన్ని ముఖ్యమైనవి.. సంతోష మానసికోలాసానికి హ్యాపీ హార్మోన్ అయిన డోపమైన్, మనలో ప్రేమ, దయ, కరుణ రసాలను ఉత్పత్తిని రేకెత్తించే - ఆక్సిటోసిన్ హార్మోన్, హాయిగా మంచి నిద్ర పట్టడానికి - మెలటోసిన్ హార్మోన్, మన జీర్ణవ్యవస్థలో ఉపకరించే ఆకలిని పుట్టించే - గ్రేలిన్ హార్మోన్, మనలో సంపూర్ణత్వాన్ని కలిగించే హార్మోన్ అయిన - లెప్టిన్ హార్మోన్, శరీరంలో శక్తిని పదునుపెట్టే - అడ్రినలిన్ (ఎపినెఫెరిన్) హార్మోన్, మంచి అనుభూతి చెందేలా చేసే- సెరోటోనిన్ హార్మోన్, నొప్పిని, నీరసాన్ని తీసివేసే (తగ్గించే) - ఎండోర్ఫిన్స్ హార్మోన్, పాల ఉత్పత్తికి తోడ్పడే - ప్రొలాక్టిన్ హార్మోన్, శరీరంలోని రక్తంలో ఉండే చక్కర స్థాయిని క్రమబద్ధీకరించే - ఇన్సులిన్ హార్మోన్, శరీర సమతుల్యతకు ఉపయోగపడే జీవక్రియను పెంచే థైరాక్సిన్ (టీ4) హార్మోన్, స్త్రీ గర్భధారణ హార్మోన్ - ప్రొజెస్టిరోన్ (హెచ్‌సీజీ ) హార్మోన్, పురుష హార్మోన్ - టెస్టోస్టిరోన్, శరీరంలోని మరియు రక్తంలోని నీటిని సమన్వయపరచే - యాంటిడైయురేటిక్ హార్మోన్, అధిక క్రొవ్వును క్రమబద్ధీకరించే - గ్లూకోగాన్ హార్మోన్, పెరుగుదలను సమపాళ్ళలో నియంత్రించే గ్రోత్ హార్మోన్ - సోమాటోట్రోఫీన్ (జీహెచ్), అస్థికల అభివృద్ధికి ఉపయోగపడే - కాల్షిటోసిన్ హార్మోన్, శరీరంలో కాల్సియం సమన్వయపరిచే - పారాథైరాయిడ్ హార్మోన్, శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించే - థైరాయిడ్ స్టిములేటింగ్ హార్మోన్ (టీఎస్‌హెచ్), స్ట్రెస్ హార్మోన్ అయిన కార్టిసోల్ హార్మోన్ ఉత్పత్తిని కూడా తక్కువచేస్తూ, ప్రధాన గ్రంధి అయిన పిట్యూటరీ గ్రంధి వీటన్నిటిని నియంత్రించేలా ఈ ప్రకృతి, అటవీ, అభయ్యారణ్యాల, జలపాతల, సెలయేళ్ల, పచ్చని గడ్డి మైదానాల, అందమైన పశు పక్షాదుల, సీతాకోకచిలుకల, పార్కుల, పర్వతాలను సందర్శించడం ద్వారా మనకు శాంతిని, ఆహ్లాదాన్ని, ఆనందాన్ని, తృప్తిని ఇస్తూ కొత్త ఉత్సాహంతో, ఉత్తేజాన్ని నింపుకొని మన దైనందిన జీవన చక్రాన్ని ముందుకు నడుపుకోవడంలో, మన ఆయుష్షును పెంచికోవడంలో ఎంతో సహకరిస్తాయి.

**ప్రకృతిలోని అడవులు, సరస్సులు, జలపాతాలను సందర్శించడం, అటవీ నడక ద్వారా మన దైనందిన జీవిత కార్యకలాపాల ద్వారా మనలో ఉత్పత్తి చేయబడిన మానసిక ఒత్తిడి సమతుల్యమవుతుంది. కొత్త ఉత్సాహం కలిగి మానసిక, శారీరక ఆనందంతో మనం మన చుట్టూ ఉన్న వారితో మంచి వాతావరణాన్ని సృష్టించుకొని, నిరాశ, నిట్టూర్పు లేకుండా జీవిస్తాము, సామరస్యం, సామర్థ్యంతో ముందుకు సాగుతాం.**



**- డిజిటల్ ఒత్తిళ్లకు చెక్**

ప్రకృతి వల్ల మానసిక ప్రయోజనాలు మానసిక స్థితిలో మెరుగుదల, ఆందోళన, నిరాశ లక్షణాలను తగ్గుతాయి. శ్రద్ధ, అభిజ్ఞా విధులను పునరుద్ధరించడంలో ప్రకృతి పాత్ర. స్వీయ నియంత్రణపై దాని ప్రభావాలు కలిగి, చిరాకు తగ్గడం, సామాజిక సంబంధం, సహకారం భావం పెరుగుదల జరుగుతుంది. ప్రకృతి భౌతిక ప్రయోజనాలు బహిరంగ వ్యాయామం, సంబంధిత శారీరక ఆరోగ్య ప్రయోజనాలను సులభతరం చేయడం తెలిసిందే. రోగనిరోధక పనితీరు, ఎండోక్రైన్ వ్యవస్థ సమతుల్యతను మెరుగుపరచడం. డిజిటల్/పట్టణ ఒత్తిళ్ల నుండి సహజ నిర్విషీకరణగా ప్రకృతి పని చేస్తుంది.

ప్రకృతిని రోజువారీ జీవితంలో చేర్చడానికి ఆచరణాత్మక మార్గాలు ప్రకృతి నడకలను మైండ్‌ఫుల్ శ్వాస లేదా ధ్యానంతో కలపడం, బహిరంగ సృజనాత్మక కార్యకలాపాలు, కాలానుగుణ కార్యకలాపాలలో పాల్గొనడం, వాటి నిర్దిష్ట ప్రయోజనాలు (ఉదా., హైకింగ్, ఈత, సైక్లింగ్) ఉంటాయి. మనం ప్రకృతిలో సమయం గడిపినప్పుడు, ఇది కార్టిసాల్ వంటి ఒత్తిడి హార్మోన్లను నియంత్రించడానికి, తొలగించడానికి సహాయపడుతుంది, వాటిని ఆనందం మరియు ఆరోగ్యాన్ని ప్రోత్సహించే హార్మోన్లతో భర్తీ చేస్తుంది. సహజ పరిసరాలలో కేవలం 20-30 నిమిషాలు కార్టిసాల్ స్థాయిలను తగ్గిస్తుందని శాస్త్రీయ అధ్యయనాలు సూచిస్తున్నాయి, ఇది కీలకమైన ఒత్తిడి హార్మోన్, ఇది ఆందోళన తగ్గడానికి, మెరుగైన మానసిక స్థితికి, మెరుగైన మానసిక స్పష్టతకు దారితీస్తుంది. ఈ మానసిక ఉద్ధరణ అనేది పునరుద్ధరించబడిన ఉత్సాహం, శారీరక శ్రేయస్సుతో జీవితాన్ని గడపడానికి అనువదిస్తుంది. ప్రకృతితో సన్నిహితంగా ఉండటం వల్ల మనం నిరాశ, అలసటను ఎదుర్కోవడానికి సహాయపడుతుంది, కానీ ఇతరులతో మన పరస్పర చర్యలలో సామరస్యం, సామర్థ్యాన్ని కూడా పెంపొందిస్తుంది. తత్ఫలితంగా, ఈ సానుకూల మనస్తత్వం దృష్టి, శక్తితో మన లక్ష్యాలను సాధించే దిశగా మనల్ని నడిపిస్తుంది.ప్రకృతిని క్రమం తప్పకుండా ఆలింగనం చేసుకోవడం వల్ల మన ఒత్తిడి ప్రతిస్పందనలు మారుతాయి, ఆనందాన్ని పెంచుతాయి, ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. సానుకూల శక్తి, సామరస్యంతో చుట్టుముట్టబడిన ఉత్పాదక, ఆనందకరమైన జీవితాలను గడపడానికి వీలు కల్పిస్తాయి. కనీసం వారాంతం కానీ, నెల చివరణ కాని, మనకు దగ్గరలో, అందుబాటులో, మన ఆర్థిక స్థోమతను బట్టి అందమైన ప్రకృతి సోయగాలను తిలకించేందుకు ప్రతిఒక్కరూ ప్రయత్నం చేసుకోవాలి.

**- రవిబాబు పిట్టల, పర్యావరణవేత్త,
మాజీ సహాయ ఆచార్యులు,
జేఎన్‌టీయూహెచ్, సంయుక్త కార్యదర్శి,
ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ.**

## భారత్‌తో ఓటముల పర్యవసానం.. పాక్ ప్లేయర్లపై పీసీబీ ఉక్కుపాదం!




**డెస్క్:** ఆసియా కప్ ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి భారత్ చేతిలో ఎదురైన ఘోర పరాభవం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఓటమిని అత్యంత తీవ్రంగా పరిగణించిన పీసీబీ, తమ ఆటగాళ్లపై కఠిన చర్యలకు ఉపక్రమించినట్టు తెలుస్తోంది. ఇకపై పాక్ క్రికెటర్లు విదేశీ టీ20 లీగుల్లో పాల్గొనకుండా నిరోధించాలని బోర్డు సంచలన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. విదేశీ లీగుల్లో ఆడాలంటే ఆటగాళ్లు తమ దేశ క్రికెట్ బోర్డు నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) పొందడం తప్పనిసరి. అయితే, ఇకపై తమ ఆటగాళ్లకు ఈ ఎన్‌వోసీలు జారీ చేయకూడదని పీసీబీ భావిస్తోంది. ఆసియా కప్‌లో ఒకే టోర్నీలో మూడుసార్లు భారత్ చేతిలో ఓడిపోవడం, ఫైనల్‌లో కప్ చేజార్చుకోవడంతో బోర్డు తీవ్ర ఆగ్రహంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు క్రికెట్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై పీసీబీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుమైర్ అహ్మద్ ఇప్పటికే కీలక ప్రకటన చేసినట్లు వార్తలు వస్తున్నాయి. విదేశీ లీగుల్లో ఆడటం వల్ల ఆటగాళ్లలో నిలకడ లోపిస్తోందని, వారి ప్రదర్శనపై తీవ్ర ప్రభావం పడుతోందని పీసీబీ భావిస్తున్నట్టు సమాచారం. అయితే, ఈ నిర్ణయం పాక్ క్రికెటర్లకు ఆటపరంగానే కాకుండా ఆర్థికంగానూ పెద్ద దెబ్బేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పీసీబీ నుంచి వచ్చే జీతభత్యాలు అంతంతమాత్రంగానే ఉంటాయి. విదేశీ లీగుల ద్వారా వారు భారీ మొత్తంలో ఆర్జించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, విదేశీ పిచ్‌లపై, అంతర్జాతీయ కోచ్‌ల పర్యవేక్షణలో ఆడటం ద్వారా వారి నైపుణ్యాలు కూడా మెరుగవుతాయి. ఇప్పటికే స్వదేశంలో సరైన మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్న పాకిస్థాన్ క్రికెట్‌కు ఈ నిర్ణయం మరింత నష్టం కలిగించే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆటగాళ్ల ఎదుగుదలను అడ్డుకుంటూ బోర్డు తీసుకుంటున్న ఈ కఠిన వైఖరి ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో చూడాలి.

## సుమీత్ హ్యాట్రిక్ ప్రపంచ పారా అథ్లెటిక్స్

**డెస్క్:** న్యూఢిల్లీ: వరల్డ్ పారా అథ్లెటిక్స్ జావెలిన్ త్రోలో ఫేవరెట్ సుమీత్ అంటిల్ వరుసగా మూడో పసిడి సాధించగా.. ఎఫ్-44 విభాగంలో సందీప్ సంజయ్ సాగర్, సందీప్ చౌధరి స్వర్ణ, రజతాలు కొల్లగొట్టారు. మంగళవారం జరిగిన పురుషుల ఎఫ్-64 ఫైనల్లో సుమీత్ 71.37 మీ. దూరం విసిరి టాప్‌లో నిలిచాడు. 2023, 2024లో కూడా అంటిల్ పసిడి పతకాలు నెగ్గాడు. పురుషుల ఎఫ్-44 కేటగిరీలో సందీప్ సాగర్ 62.82 మీటర్లు విసిరి టాప్‌లో నిలిచాడు. చౌధరి 62.67 మీటర్ల దూరం విసిరి రజతం దక్కించుకొన్నాడు. పురుషుల ఎఫ్-56 డిస్కస్ త్రోలో యోగేష్ కథూనియా 42.49 మీ. దూరం విసిరి రజతం సాధించాడు. కాగా, తెలంగాణకు చెందిన బానోతు అకీరా నందన్ పురుషుల 400 మీ. టీ38 కేటగిరి హీట్-1లో 50.55 సెకన్ల టైమింగ్‌తో ఫైనల్‌కు అర్హత సాధించాడు.

## ఐసీసీ వుమెన్స్ వరల్డ్ కప్..



**డెస్క్:** : ఐసీసీ వన్డే వుమెన్స్ వరల్డ్ కప్‌కు భారత్-శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. భారత్-శ్రీలంక మధ్య మంగళవారం తొలి మ్యాచ్ జరిగింది. ఈ ప్రారంభ మ్యాచ్‌ను చూసేందుకు దాదాపు 23వేల మంది ప్రేక్షకులు స్టేడియానికి వచ్చారు. ఇది ఐసీసీ మహిళల టోర్నమెంట్ గ్రూప్ దశ మ్యాచ్‌లో రికార్డు కావడం విశేషం. మంగళవారం జరిగిన మ్యాచ్‌ను 22,843 మంది ప్రేక్షకులు ప్రత్యక్షంగా వీక్షించారు. గతేడాది దుబాయిలో జరిగిన వుమెన్స్ టీ20 ప్రపంచకప్‌లో భారత్-పాకిస్తాన్ మధ్య జరిగిన మ్యాచ్‌కు 15,935 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. తాజాగా ఐసీసీ వుమెన్స్ ప్రపంచ కప్ ప్రారంభ మ్యాచ్ 22,843 మంది హాజరయ్యారని.. ఇది ఐసీసీ వుమెన్స్ టోర్నమెంట్‌లో గ్రూప్ దశ మ్యాచ్‌లో రికార్డని ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. తొలి మ్యాచ్‌లో భారత జట్టు శ్రీలంకపై 59 పరుగుల తేడాతో గెలిచి ఈ టోర్నీ గ్రాండ్‌గా ప్రారంభించింది. దీప్తి శర్మ ఆల్ రౌండ్ ప్రదర్శనతో భారత మహిళా జట్టు వన్డే ప్రపంచ కప్ తొలి మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో శ్రీలంకను 59 పరుగుల తేడాతో ఓడించింది. దీప్తి, అమంజోత్ కౌర్ అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. దాంతో తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు 47 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 269 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన శ్రీలంక 45.4 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయింది. దీప్తి బ్యాట్‌తో పాటు బంతితో అద్భుతంగా రాణించింది. మూడు వికెట్లు పడగొట్టింది. శ్రీలంక తరఫున 43 పరుగులతో చమరి అటపట్టు టాప్ స్కోరర్‌గా నిలిచింది. నీలాక్షి డిసిల్వా 35, హర్షిత సమరవిక్రమ 29, అచ్చిని కులసూర్య 17 పరుగులు చేశారు. దీప్తి మూడు వికెట్ల పడగొట్టగా.. స్నేహ రాణా, శ్రీ చరణి చెరో రెండు వికెట్లు తీశారు.

## వరుసగా నాలుగో వారం కూడా అదే రంజు.. వన్డే వరల్డ్ కప్‌లో భారత్ పాక్ హై టెన్షన్ మ్యాచ్




**డెస్క్:** భారత్, శ్రీలంక సంయుక్త ఆధ్వర్యంలో మహిళల వన్డే వరల్డ్ కప్ ఇప్పటికే మొదలైంది. ఈ ఐసీసీ ఈవెంట్‌లో, రాబోయే అక్టోబర్ 5, ఆదివారం నాడు భారత్, పాకిస్తాన్ మహిళల జట్ల మధ్య మరో క్రికెట్ యుద్ధం జరగనుంది. వరుసగా నాలుగో ఆదివారం కూడా భారత్-పాక్ పోరు జరుగుతుండటం అభిమానులకు పెద్ద పండుగే. మరోసారి ఆదివారం వచ్చింది. భారత్-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ కోసం అభిమానులు సిద్ధంగా ఉన్నారు. ఇది వరుసగా నాలుగో వారం, భారత్-పాక్ పోరుతో క్రికెట్ అభిమానులకు ఫుల్ థ్రిల్ దొరకబోతోంది. అయితే, ఈసారి పాకిస్తాన్‌కు ఓటమి రుచి చూపించే పనిని భారత అమ్మాయిలు చేయబోతున్నారు. ఈ ఆదివారం సూర్యకుమార్ యాదవ్ టీమ్ ఇండియా కాదు, హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత మహిళా జట్టు పాకిస్తాన్‌ను చిత్తు చేయనుంది. భారత్-పాకిస్తాన్ మధ్య ఈ కీలక పోరు మహిళల వన్డే వరల్డ్ కప్?లో జరగనుంది. ఈ తాజా పోరుకు ముందు, గత మూడు ఆదివారాలలో సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారత పురుషుల క్రికెట్ జట్టు పాకిస్తాన్‌ను ఘోరంగా ఓడించింది. భారత పురుషుల జట్టు ఆసియా కప్ 2025 లో మొదటిసారి గ్రూప్ దశలో సెప్టెంబర్ 14న పాకిస్తాన్‌తో తలపడింది. ఆ తర్వాత సెప్టెంబర్ 21న సూపర్-4 రౌండ్‌లో మళ్లీ ఓడించింది. చివరగా, సెప్టెంబర్ 28న జరిగిన ఆసియా కప్ 2025 ఫైనల్‌లో కూడా భారత్ చేతిలో పాకిస్తాన్ చిత్తుగా ఓడిపోయింది. ఇప్పుడు అక్టోబర్ 5న భారత్, పాకిస్తాన్ మహిళల జట్లు ముఖాముఖి తలపడనున్నాయి. కొలంబో మైదానంలో జరగనున్న ఈ మ్యాచ్‌లో, భారత మహిళా జట్టు పాకిస్తాన్‌పై తమ రికార్డును 12-0 కు పెంచుకోవడానికి గట్టిగా ప్రయత్నిస్తుంది. గత 20 ఏళ్లలో భారత్, పాకిస్తాన్ మహిళల జట్లు వన్డే ఫార్మాట్‌లో 11 సార్లు తలపడ్డాయి. ఈ 11 మ్యాచ్‌లలోనూ విజయం పూర్తిగా భారత్‌కే దక్కింది.

## ఆసియా కప్ ట్రోఫీ వివాదం..

**డెస్క్:** ఆసియా కప్ 2025 ట్రోఫీ చుట్టూ నడుస్తున్న వివాదం ఇప్పుడు కొత్త మలుపు తిరిగింది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు మోహ్‌సిన్ నఖ్వీ ఈ వివాదంపై స్పందిస్తూ, ట్రోఫీని తనతో తీసుకెళ్లిన విషయంలో భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ)కి క్షమాపణలు తెలిపినట్లు సమాచారం. ఇది క్రికెట్ డిప్లమసీలో ఒక పాజిటివ్ స్టెప్‌గానే భావించబడుతోంది. అయితే, ట్రోఫీ తిరిగిచ్చే విషయంలో నఖ్వీ ఓ కండిషన్ పెట్టినట్టు తెలుస్తోంది. ఆయన చెబుతోన్నదాని ప్రకారం, ట్రోఫీని టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్వయంగా ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఆఫీస్‌కు వచ్చి స్వీకరించాల్సిందే. ఇది సాధారణ శిష్టభద్రత చర్య కాదని, వ్యక్తిగత గౌరవానికి సంబంధించిన విషయమని పాకిస్థాన్ మీడియా చెబుతోంది. ఈ షరతుపై బీసీసీఐ ఇంకా అధికారికంగా స్పందించలేదు. ట్రోఫీ స్వీకరణకు టీమిండియా కెప్టెన్‌ను పాక్‌లోని ఏసీసీ ఆఫీస్‌కు పంపించాలన్న నఖ్వీ డిమాండ్‌ను బీసీసీఐ ఎలా సమాధానమిస్తుంది అనే దానిపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ వివాదం క్రికెట్ డిప్లమసీకి తలనొప్పిగా మారే ప్రమాదం కనిపిస్తోంది. ఇప్పటికే పాకిస్థాన్-భారత్ క్రికెట్ సంబంధాలు రాజకీయ కారణాల వల్ల తేలికగా లేవు. ఈ ట్రోఫీ వివాదం నేపథ్యంలో రెండు దేశాల క్రికెట్ బోర్డుల మధ్య సంబంధాలు మరింత సంక్లిష్టంగా మారే అవకాశం ఉంది. ఏసీసీ అధ్యక్షుడిగా నఖ్వీ చురుగ్గా వ్యవహరించడంతో పాటు, ఈ వివాదానికి పరిష్కారం చూపే మార్గం కూడా ఆయన చేతులలోనే ఉన్నట్లు స్పష్టమవుతోంది.

# మళ్లీ సమ్మె దిశగా ప్రైవేట్ కళాశాలలు

విడుదల చేయలేదు. గత నెల 21, 22 తేదీల్లో రూ.600 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చినా బకాయిలు చెల్లించలేదు. రూ.200 కోట్లు నిధులు మాత్రమే విడుదల చేశారు. దీపావళిలోపు రూ.1,200 కోట్లు ఇస్తామని అన్నారు ఎలా ఇస్తారో చెప్పాలి. ఈ నెల 12లోపు బకాయిలు చెల్లించకుంటే 13 నుంచి సమ్మెకు వెళ్తాం. ఇవాళ్టి నుంచి సీఎంవో కార్యాలయంతో తప్ప మరెవరితో చర్చించం. అవసరం అయితే విద్యార్థులతో కలిసి ఛలో హైదరాబాద్ చేపడతాం." రమేశ్, ఎఫ్ఏటీహెచ్ఐ ఛైర్మన్ రాష్ట్ర ప్రభుత్వం కాలేజీలకు విడుదల చేయవలసిన బకాయిల మొత్తం రూ.1,200 కోట్లకు పైగా ఉందని గతంలో ఎఫ్ఏటీహెచ్ఐ పేర్కొంది. బకాయిలు చెల్లించాలని కోరుతూ సెప్టెంబర్ 15 తరగతుల బంద్??కు ప్రకటించాయి. ఈ ప్రతిపాదనకు రాష్ట్రంలోని కొన్ని కాలేజీలు మద్దతు పలికాయి. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం మళ్లు భట్టి విక్రమార్క సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం, కాలేజీ యాజమాన్యాలతో చర్చలు జరిపింది.

ఆ సమయంలో తెలంగాణలోని వృత్తి విద్యా కళాశాలల యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలం అయ్యాయి. దీపావళిలోగా రూ.1200 కోట్ల బకాయిలు విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఫీజురీయింబర్స్‌మెంట్ అంశంపై మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులతో జరిపిన చర్చలు విజయవంతమైనట్లు అప్పుడు ప్రకటించాయి. చర్చలు సఫలం కావడంతో తరగతుల బంద్‌ను ఉపసంహరించుకున్నట్లు వృత్తి విద్యా కళాశాలల యాజమాన్యాలు తెలిపాయి. కానీ బకాయిలు పూర్తిగా రాకపోవడంతో మళ్లీ

# ఆర్బీఐ రెపోరేట్ జోష్.. లాభాల్లోకి సూచీలు..




డెస్క్ : గత ఎనిమిది సెషన్లుగా వరుసగా నష్టాలనే చవిచూస్తున్న దేశీయ సూచీలకు ఆర్బీఐ రెపోరేట్ జోష్ అందించింది. ఆర్బీఐ రెపోరేట్‌ను మరోసారి యథాతథంగా ఉంచుతున్నట్టు ప్రకటించడం మార్కెట్లకు కలిసొచ్చింది. బ్యాంకింగ్ సెక్టార్‌లో కొనుగోళ్లు సూచీలను ముందుకు నడిపిస్తున్నాయి. ఉదయం నష్టాలతో మొదలైన సూచీలు ఆ తర్వాత లాభాల బాట పట్టాయి. ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో కదలాడుతన్నాయి. మంగళవారం ముగింపు (80, 267)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 100 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత లాభాల్లోకి ఎగబాకింది. ఆర్బీఐ వడ్డీ రేట్ల ప్రకటన తర్వాత కనిష్టం నుంచి ఏకంగా 400 పాయింట్లకు పైగా లాభపడింది. ప్రస్తుతం ఉదయం 10:50 గంటల సమయంలో సెన్సెక్స్ 292 పాయింట్ల లాభంతో 80, 560 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 76 పాయింట్ల లాభంతో 24, 687 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో హడ్కో, లూపిన్, టాటా మోటార్స్, వోడాఫోన్ ఐడియా, ఆర్ఈసీ, ట్రెంట్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి . ఆర్బీఎల్ బ్యాంక్, డెలివరీ, ఎస్బీఐ కార్డ్, ఎల్‌టీఐ మైండ్ ట్రీ మొదలైన షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 27 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 374 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 88.72గా ఉంది.

# ఐ బొమ్మపై పోలీసుల దృష్టి

ఏజెంట్లు ఉన్నట్లు గుర్తించారు. మరోవైపు ఓటీటీ కంటెంట్‌ను తస్కరిస్తూ నిర్వాహకులకు తలనొప్పిగా మారడంతో ఐబొమ్మని కట్టడి చేసేందుకు విచారణ వేగవంతం చేశారు. ఈ క్రమంలో ఆ పైరసీ వెబ్‌సైట్ నుంచి ఓ ప్రకటన వచ్చిందటూ సోషల్ మీడియాలో వేదికగా వైరల్‌గా మారింది. సినిమా పరిశ్రమకు పెను సవాల్‌గా మారిన పైరసీ ముఠాను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. దేశంలోనే అతి పెద్దదైన ముఠాను ఛేదించి ఆరుగురిని అరెస్టు చేశారు. తెలుగు సహా పలు భాషల సినిమాలను పైరసీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. దీని ద్వారా సినిమా ఇండస్ట్రీకి దాదాపు రూ.3,700 కోట్లు నష్టం జరిగిందని పోలీసులు తెలిపారు.

గతంలో హ్యాష్ ట్యాగ్ సింగిల్ సినిమా పైరసీపై పోలీసులకు కంప్లైంట్ అందిండి. దీనిపై విచారణ చేపట్టి నిందితుడిని జులై 3న రంగారెడ్డి జిల్లా వనస్థలిపురంనకు చెందిన కిరణ్‌ను అరెస్టు చేశారు. అతడిని కస్టడీలోకి తీసుకుని విచారించగా, ఆ పైరసీ ముఠా సభ్యులు నెదర్లాండ్, దుబాయ్, మయన్మార్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఈటీవీ విన్ కంటెంట్‌ను పైరసీ చేసి అమ్ముకున్న మరో నిందితుడిని అరెస్టు చేశారు. ఇలా రికార్డ్ చేసి ఒరిజినల్ కంటెంట్‌ను తీసుకుని ఇతర వెబ్‌సైట్లకు ముఠా విక్రయిస్తోంది. థియేటర్లలో ప్లే అయ్యే శాటిలైట్ కంటెంట్ ఐడీ, పాస్‌వర్డ్‌లను సైతం నేరగాళ్లు క్రాక్ చేస్తున్నారు. కొన్ని సార్లు క్రాక్ అవ్వని పక్షంలో ఏజెంట్లకు కెమెరాలు అందజేసి, రహస్యంగా రికార్డు చేయడాన్ని నేర్పిస్తున్నారు. అనంతరం ఆ ఏజెంట్లకు టికెట్లు బుక్ చేసి మరీ థియేటర్లలో సినిమాలు రికార్డ్ చేస్తున్నారు. చొక్కా జేబు, పాప్ కాన్ డబ్బా, కోక్ టిన్‌లలో కెమెరాలు పెట్టి చిత్రీకరిస్తున్నారు. ఏజెంట్లకు క్రిప్టో కరెన్సీ రూపంలో నిందితులు కమీషన్లు ఇస్తున్నారు. కేవలం తెలుగు సినిమాలే కాదు, తమిళ్, మళయాళం, హిందీ సినిమాలపై నేరగాళ్లు ప్రత్యేక దృష్టి పెట్టారు.

# వడ్డీ రేట్లపై ఆర్బీఐ కీలక నిర్ణయం!




**డెస్క్ :** సామాన్యులకు మరోసారి ఆర్బీఐ గుడ్ న్యూస్ చెప్పింది. ఈరోజు జరిగిన సమావేశంలో వడ్డీ రేట్లపై కీలక నిర్ణయం తీసుకుంది. రెపో రేటు యథాతథంగా ఉంచుతూ ప్రజలకు తీపి కబురు అందించింది. కాగా రెపో రేటు 5.5 శాతం యథాతథంగా ఉండనుంది. అయితే ఆర్బీఐ రేపో రేటులను స్థిరంగా ఉంచడం ఇది రెండో సారి. అయితే.. తాజా ఆర్బీఐ ప్రకటనతో మనం కట్టే ఈఎంఐలలో ఎలాంటి మార్పులు ఉండవు. దేశ ఆర్థిక వ్యవస్థను బలపరిచే దిశగా ఆర్బీఐ అడుగులు వేస్తోంది. అయితే ఇటీవల అతర్జాతీయంతో పాటు మన దేశంలో నెలకొన్న కొన్ని పరిస్థితుల కారణాలతో ఈ సంవత్సరం ఫిబ్రవరి, ఏప్రిల్ లో జరిగిన సమావేశంలో రేపో రేట్లను 0.25 శాతం చొప్పున తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా.. జూన్ నెలలో నిర్వహించిన సమావేశంలో ఆర్బీఐ ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. కాగా ఇలా వరుసగా మూడు కీలక సమావేశాల్లో ఆర్బీఐ.. రేపో రేటును 1 శాతం మేర తగ్గించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ పై విధించిన పన్నుల భారం, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఆగస్టు నెలలో రేపో రేటు మాత్రం యథాతథంగా 5.5 శాతం వద్దే ఉంచుతూ నిర్ణయం తీసుకుంది. అయితే అక్టోబర్ నెలలో కూడా రేపో రేటును యథాతథంగా ఉంచుతూ ప్రకటన విడుదల చేసింది.

# బీసీ రిజర్వేషన్ల బిల్లుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

డితే రిజర్వేషన్ల కేటాయింపులో స్పష్టత వస్తుందని కవిత సూచించారు. ఇదే సమయంలో, స్థానిక ఎన్నికలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపైనా కవిత తీవ్రంగా స్పందించారు. న్యాయస్థానాలను తప్పుదోవ పట్టించేలా ఈటల మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యలు సొంతమా లేక పార్టీవి చెప్పించారా అని నిలదీశారు. ఈ వ్యాఖ్యల పట్ల ఈటల రాజేందర్ బీసీ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. మరోవైపు, రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలను మార్చి గెజిట్ విడుదల చేసిందని ఆరోపించారు. అయితే, బతుకమ్మ నిమజ్జన కార్యక్రమంలో సీఎం పాల్గొనడాన్ని ఆమె స్వాగతించారు. ఈ సందర్భంగా, తనకు బీఆర్ఎస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని కవిత స్పష్టం చేయడం గమనార్హం.



# బంగారం ధర మరింత పెరిగింది..

# ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..

**డెస్క్:** బంగారం ధర రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది . డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (అక్టోబర్ 1న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 17, 450కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 07, 660కి చేరింది . నిన్నటితో పోల్చుకుంటే దాదాపు వెయ్యి రూపాయల మేర బంగారం ధర పెరిగింది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 17, 600కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 07, 810కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 17, 450కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1, 07, 660కి చేరింది (%+శీశ్రీస జూతీఅషెవ అఅ ఎఎఎవతీఘుఖ్మఎ%). వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద రూపాయిల మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

# సెప్టెంబర్‌లో 15 శాతం తగ్గిన ఆటో మొబైల్ సేల్స్..

**డెస్క్:** సెప్టెంబర్‌లో రిటైల్ ఆటోమొబైల్ సేల్స్ దాదాపు 13శాతం పడిపోయాయి. పండుగ సీజన్‌కు ముందు నెలాఖరు నాటికి డిమాండ్ మొదలైంది. దాంతో ఆటో కంపెనీలకు ఊరట కలుగడంతో పాటు అక్టోబర్‌పై ఆశలను రేకెత్తించింది. వాహన్ పోర్టల్ డేటా ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నాటికి మొత్తం 1.51 మిలియన్ వాహనాలు నమోదయ్యాయి. గత సంవత్సరం ఇదే సమయంలో 1.74 మిలియన్ యూనిట్లతో పోలిస్తే ఇది 13.28 శాతం తగ్గింది. ఈ గణాంకాలు రిజిస్ట్రేషన్స్ మాత్రమే ప్రతిబింబిస్తాయని.. పూర్తి డెలివరీల వివరాలు కొద్దిరోజుల తర్వాత మాత్రమే తెలుస్తుందని ఆటో పరిశ్రమ నిపుణులు తెలిపారు. సెప్టెంబర్ తొలి మూడువారాల్లో కొనుగోళ్లు మందగించాయి. పండుగ ఆఫర్లు, జీఎస్టీ రేట్లలో మార్పుల్లో స్పష్టత కోసం కొనుగోలుదారులు వాహనాలను కొనుగోలు చేయకుండా నిరీక్షించినట్లుగా పరిశ్రమ వర్గాలు తెలిపాయి. అదే సమయంలో పితృపక్షాలు సైతం షాపింగ్‌ను ప్రభావితం చేసిందని మార్కెట్ వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్ 22న నవరాత్రుల ప్రారంభం నుంచే మార్కెట్‌లో సందడి కనిపించిందని.. జీఎస్టీ సంస్కరణలతో ధరలు సైతం తగ్గడంతో షోరూమ్స్ సందడిగా కనిపించినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా ప్యాసింజర్ కార్లు, ద్విచక్ర వాహనాల విభాగాల షోరూమ్‌ల్లో కస్టమర్ల రద్దీ, బుకింగ్‌లు, ఎక్వైరీలు పెరిగాయి. దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి సెప్టెంబర్ 22 నుంచి 25 మధ్య కేవలం నాలుగు రోజుల్లో 75వేల వాహనాలను విక్రయించింది. మారుతి ఆగస్టు నెల మొత్తంలో సుమారు 1.35లక్షల యూనిట్లను విక్రయించింది. నెలాఖరు నాటికి డిమాండ్ ఎంత వేగంగా పెరిగిందో గణాంకాలు చెబుతున్నాయి. గత సంవత్సరం అక్టోబర్‌లో నవరాత్రి వేడుకలు ప్రారంభం కాగా.. పండుగల ప్రభావం సెప్టెంబర్‌లో కనిపించలేదు. ఈ సంవత్సరం సెప్టెంబర్ చివరి వారంలో డిమాండ్ కనిపించింది. ఇక రాబోయే నెలల్లో అమ్మకాలు జోరుగా సాగుతాయని ఆటోమొబైల్ ఇండస్ట్రీ భావిస్తున్నది. అక్టోబర్‌లో పండుగలు కొనసాగనున్నాయి. ఆ తర్వాత పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమవుతుంది. పెట్రోల్ కార్లపై (1200సీసీ వరకు), డీజిల్ కార్లపై (1500 సీసీ వరకు) 18శాతానికి జీఎస్టీ తగ్గింది. అంతకంటే ఎక్కువ సీసీ కలిగిన వాహనాలపై 40శాతం.. ఇక ఎలక్ట్రికల్ వాహనాలపై కేవలం 5శాతం జీఎస్టీ పరిమితం చేయడంతో పరిశ్రమకు ఊతమిస్తుందని ఆటో ఇండస్ట్రీ భావిస్తున్నది.

# పండుగల వేళ పెరిగిన గ్యాస్ ధర..

# కమర్షియల్ సిలిండర్‌పై రూ.15.50 వడ్డన..!

**డెస్క్:** గ్యాస్ ధరలు వినియోగదారులకు షాక్ ఇచ్చాయి. పండుగ వేళ గ్యాస్ భారం స్వల్పంగా పెరిగింది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరలను పెంచినట్లు చమురు మార్కెటింగ్ కంపెనీలు తాజాగా ప్రకటించాయి. 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధరను రూ.15.50 మేరకు పెంచినట్టు ప్రకటించాయి. దాంతో వాణిజ్య సిలిండర్ ధర రూ.1595.50కి పెరిగింది. కీలక పండుగలకు ముందు వాణిజ్య సిలిండర్ గ్యాస్‌పై ఎక్కువగా ఆధారపడే హొటల్స్, రెస్టారెంట్లతో పాటు పలు రంగాలను ప్రభావితం చేయనున్నది. సవరించిన రేట్ల ప్రకారం.. 19 కిలోల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధరను రూ.15.50 పెరగ్గా.. ఢిల్లీలో, 19 కిలోల వాణిజ్య సిలిండర్ రూ.1,595.50 పెరిగింది. దేశ ఆర్థిక రాజధాని ముంబయి మహానగరంలో రూ.1,547, చెన్నైలో రూ.1,754, కోల్‌కతాలో రూ.1,700కి పెరిగింది. ఇక 14.2 కిలోల డొమెస్టిక్ సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పులు లేదు. దాంతో గృహ గ్యాస్ వినియోగదారులకు ఊరట లభించినట్లయ్యింది. ప్రస్తుతం డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర ముంబయిలో రూ.852.50, ఢిల్లీలో రూ.853, చెన్నైలో రూ.868.50, కోల్‌కతాలో రూ.879, హైదరాబాద్‌లో రూ.925గా ఉన్నది. వాస్తవానికి వాణిజ్య అవసరాల కోసం వినియోగించే సిలిండర్‌ల ధరలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రతి నెలా ఒకటో తేదీన మార్పులు చేస్తుంటాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ఇంధన ధరలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ, ప్రభుత్వ విధానాలు, పన్ను విధానంలో మార్పులు, డిమాండ్ సరఫరాల్లో సీజనల్ మార్పులు, భౌగోళిక రాజకీయ అంశాలు, ఆయిల్ కంపెనీలు ఖర్చులు ఆదాయం తదితర అంశాల ఆధారంగా సిలిండర్ ధరల్లో మార్పులు చేస్తూ వస్తాయి. అయితే, మార్కెట్ ఒడిదుడుకుల ప్రభావం సామాన్యులపై పడకుండా ప్రభుత్వం గృహవినియోగ సిలిండర్ల ధరలను నియంత్రిస్తుంది. డొమెస్టిక్ గ్యాస్ ధరలను ప్రభుత్వం నియంత్రిస్తుండడంతో జనాలకు ఊరట కలుగుతున్నది. అయితే, వాణిజ్య సిలిండర్ల ధరలను మాత్రం ప్రతినెలా మారుతుంటాయి. ఒక్కో సందర్భంలో ధరలు తగ్గుతుంటాయి. అయితే, గత సెప్టెంబర్‌లో ధరలు పెరిగిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి ధరలు పెరగడంతో హొటల్స్, క్యాటరింగ్ సేవలు తదితర వాణిజ్య సంస్థలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందని భావిస్తున్నారు. ఇవన్నీ రోజువారీ కార్యకలాపాల కోసం ఎల్‌పీజీపైనే ఆధారపడుతుంటాయి. సిలిండర్ ధర పెరగడంతో ఈ వ్యాపారాల నిర్వహణ ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. ఖర్చులను వినియోగదారుల నుంచి రాబట్టేందుకు ధరలను పెంచే అవకాశం ఉందని భావిస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073